క్లుప్తంగా

తొలి ప్రధాని నెహ్రూకు ఘన నివాళి



బాపట్ల అర్బన్: భారత దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సభ పట్టణంలోని అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంజిబాబు మాట్లాడుతూ భారతదేశపు తొలి ప్రధానిగా నెహ్రూ బాధ్యతలు చేపట్టినప్పుడు కేవలం 50 గ్రామాల్లో మాత్రమే కరెంటు ఉండేదన్నారు. నెహ్రూ ప్రధాని అయిన తరువాత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే జీవిత బీమాను ప్రైవేటు పరం చేసి, పేదల భద్రతపై నీళ్లు చల్లారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పట్టణ రాజేష్, శీలం సాగర్, దండు రేణుక, నలిని, శంకర్ రెడ్డి, రవి, తాజుద్దీన్, మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా ఎస్పీ



బాపట్లటౌన్: బాపట్ల జిల్లాకు విచ్చేసిన ఏపీ హైకోర్టు జడ్జి పి.వెంకట జ్యోతిర్మయిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బాపట్ల అగ్రికల్చరల్ కళాశాల అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, పలు విషయాలపై కొద్దిసేపు చర్చించారు.

ఆయుర్వేద వైద్యశాలను పునఃప్రారంభించండి



చావలి(వేమూరు): ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మూత పడినా.. వైద్యులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. చావలి గ్రామంలో కొన్ని సంవత్సరాల నుంచి ఆయుర్వేద వైద్యశాల కొనసాగుతోంది. వైద్య శాలలో వైద్యులు, కాంపౌండర్ వైద్య సేవలు అందించేవారు. వైద్య శాల పరిధిలో చావలి, పెరవలి, పెరవలి పాలెం, కోడిపర్రు, పెనుమర్రు, అబ్బనగూడ వల్లి, బలిజేపల్లి గ్రామాలకు చెందిన రోగులు వైద్య సేవలు పొందారు. కొన్ని నెలలు నుంచి అధికారులు ఆయుర్వేద వైద్యశాల మూత వేశారు. ఇక్కడ పని చేసిన వైద్యులను, కాంపౌండర్‌ను బదిలీ చేశారు. అధికారులు చొరవ తీసుకొని చావలి గ్రామంలోని ఆయుర్వేద వైద్య శాలను తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్ నుంచి పడి యువకుడి మృతి

భట్టిప్రోలు: ద్విచక్ర వాహనంపై వస్తూ మట్టిగుట్టపై ప్రమాదవశాత్తూ జారిపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన భట్టిప్రోలులో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కారంపూడి డేవిడ్‌పాల్(25) చీరాలలో రొయ్యల చెరువు వద్ద పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి చీరాలకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో.. హైవేపై మట్టిగుట్ట ఎక్కిచడంతో జారిపడి.. తలకు తీవ్ర గాయాలై.. అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం మృతుడు తండ్రి ప్రకాశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

పోలీసులొచ్చారు.. జూదరులు పరారయ్యారు

కొల్లూరు: పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడిచేశారు. వారి రాకను గమనించిన జూదరులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు నక్కపాయ వెంబడి ఇటుక బట్టీల ప్రాంతంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు.. సమాచారం మేరకు రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు బృందం దాడి చేసింది. పోలీసుల రాకను గమనించిన జూదరులు అక్కడి నుంచి పరారయ్యారు.
జూదరులకు చెందిన నాలుగు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసిననట్లు ఏఎస్‌ఐ బాబురావు తెలిపారు. పేకాట నిర్వహిస్తున్నది పెసర్లంకకు చెందిన ఓ వ్యక్తిగా విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం..

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెంలో 9 పంచాయతీల వలంటీర్లకు సన్మానం



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: కరోన సమయంలో గ్రామ వలంటీర్ల సేవలు అమోఘమని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం జరిగిన గ్రామ వలంటీర్ల సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వలంటీర్లకు శాలువాలు కప్పి.. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు. మండల పరిధిలోని చింతాయపాలెం, గణపవరం, పెదపులుగువారి పాలెం, నర్రావారి పాలెం, తుమ్మలపల్లి, పేరలిపాడు, పెదగొల్లపాలెం, పేరలి, సమ్మెట వారిపాలెం గ్రామ పంచాయతీల పరిధిలోని వలంటీర్లను సన్మానించారు. నవ రత్నాల పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారని తెలిపారు. అతి తక్కువ గౌరవ వేతనం తీసుకుంటూ.. ఎంతో బాధ్యతగా విధులను సక్రమంగా నిర్వహిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం చేస్తున్న చిరు సన్మానం తక్కువేనని కోన అభిప్రాయపడ్డారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా ఆ పార్టీ వారికే పథకాలు అందేవని ఎమ్మెల్యే కోన విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్లలో 98శాతానికి పైగా హామీలు అమలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు, బాపట్ల ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, బాపట్ల రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ డి.రాంబాబు, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, చింతాయపాలెం సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు అక్కల శ్రీనివాసరెడ్డి, దేవరకొండ అంకమ్మ, కాగిత కరుణకుమారి, యల్లావుల సురేష్‌యాదవ్, దబ్బకూటి ఏడుకొండలు, మల్లెల ఆదాం, ఎంపీటీసీలు తాండ్ర సాంబ శివరావు, రాతంశెట్టి లక్ష్మణరావు, దిండి నాగలక్ష్మి, నాయకులు మందపాటి పరమానంద కుమార్, ఆట్ల అయ్యప్పరెడ్డి, డి.రమేష్, శామ్యూల్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ వారధులు వార్డు వలంటీర్లు అని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణ పరిధిలో 10 సచివాలయం నుంచి 20వ సచివాలయం పరిధిలోని వలంటీర్లకు శనివారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను ఎమ్మెల్యే కోన రఘుపతి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కోకి రాఘవరెడ్డి, ఔట్ సోర్సింగ్ డైరెక్టర్ గోరుముచ్చు పుష్పరాజ్యం, చేజర్ల నారాయణరెడ్డి, కాగిత సుధీర్ బాబు, చింతల రాజశేఖర్, జోగిరాజా, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, సూరేపల్లి ఆదిలక్ష్మి, మున్సిపాలిటీ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌కు మోక్షం

మంత్రి నాగార్జున చొరవతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనుల అనంతరం భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్

భట్టిప్రోలు: ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోని భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్ (ఉప్పు కాల్వ) అభివృద్ధికి మోక్షం కలిగింది. మండలంలోని అక్కివారి పాలెం రోడ్డు బ్రిడ్జి నుంచి వెల్లటూరు చానల్ అక్విడెక్ట్ వరకు రూ. 31.86 లక్షల వ్యయంతో పూడిక తీత పనులను భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్ వంతెన వద్ద డిసెంబర్ 5న ప్రారంభించారు. డ్రెయిన్‌లో నీరు పారుదల కావడంతో పరిస్థితులు అనుకూలించక పనులను నిలుపుదల చేసి, వేసవిలో మరలా ప్రారంభించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున చొరవతో సమస్య పరిష్కారం కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి



గ్రామ వలంటీర్‌కు పురస్కారం అందజేస్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే చేరుతున్నాయని చెప్పారు. నగరం మండలంలో ఇప్పటి వరకు సంక్షేమ పథకాలకు గాని, పలు అభివృద్ధి పనులకు రూ.108 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నవరత్నాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికి కాపాడుకునేందుకు తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 2024 ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధిస్తుందని వివరించారు. ఇటీవల నిజాంపట్నం మత్స్యకార భరోసా పంపిణీ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌కి నియోజకవర్గంలోని పలు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. రహదారుల అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఈ నిధులతో నగరం మండలంలోని పలు గ్రామాలను కలిపే రహదారులను అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. తొలుత గ్రామాల వారీగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం గ్రామ వలంటీర్‌లకు సన్మానం చేసి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మాన్యం నాగమణి, ఎంపీడీఓ ఎస్.రాధారమణ, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వల్లే రోడ్డు ప్రమాదాలు



బాపట్లటౌన్: అతివేగం... నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు ప్రమాదాలకు కారణమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ పేర్కొన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నో యాక్సిడెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్‌ప్రోన్ ఏరియాలుగా గుర్తించిన 77 ప్రదేశాల్లో విధులు నిర్వహించి హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహన చోదకులకు, అతివేగంగా వాహనాలను నడిపే వాహన చోదకులకు, ఇతర రోడ్డు భద్రతా నియమాలు పాటించని వాహన చోదకులకు రోడ్డు భద్రత నియమాల గురించి హెల్మెట్, సీట్ బెల్ట్ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. వాహన చోదకులు నిర్ణీత వేగంలో ప్రయాణించినప్పుడే రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారన్నారు. మద్యం తాగి, మితి మీరిన వేగంతో ప్రయాణించినా అలాంటి వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

'అంగన్‌వాడీ' పోస్టులకు ఇంటర్వ్యూలు

రేపల్లె: రేపల్లె ఐసీడీఎస్ సెక్టారు పరిధిలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి శనివారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి ఇంటర్వ్యూ చేశారు. సెక్టార్ పరిధిలో 19 సహాయకుల పోస్టులకు 38 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోన్నారని తెలిపారు. ఇంటర్వ్యూకు 36 మంది హాజరయ్యారని, వీరిలో నిబంధనల ప్రకారం అర్హత కలిగిన 19 మందిని ఎంపిక చేసి, నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపినట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: ఇసుక పల్లిలోని సబ్ స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో రేపల్లె పట్టణ, మండలం, భట్టిప్రోలు మండలంలోని 9 సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ పి.ఏడుకొండలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఫలం.. ప్రియం

- ఎండలకు మండిపోతున్న పండ్ల ధరలు..
- ఆరోగ్యంపై శ్రద్ధ..పెరిగిన వినియోగం
- డిమాండ్‌కు తగ్గట్టు..ధరలు పెంచిన వ్యాపారులు



బాపట్లలో పండ్ల దుకాణం

బాపట్ల అర్బన్: భానుడి భగ భగ నుంచి ఉపశమ నం పొందాలంటే చల్లని పదార్థాలు, పండ్ల రసాలు తీసుకోక తప్పనిసరి. ఇక వేసవి సెలవుల్లో ఇంట్లోనే ఉంటున్న పిల్లలకు, వృద్ధులకు పోషక విలువలు ఉన్న తాజా పండ్లు తినడం మంచిదని వైద్యులు కూడా సూచిస్తుంటారు. కానీ, ప్రస్తుతం మండే ఎండలకు మార్కెట్లో పండ్ల ధరలు కూడా భగ భగమంటున్నాయి. ఆపిల్, దానిమ్మ, పైనాపిల్, కమల, ద్రాక్ష, బొప్పాయి, అరటిపండు, ఇలా పండు ఏదైనా..వాటి ధరలు సామాన్యులకు అందనంటున్నాయి.

పెరిగిన వినియోగం

కరోనా అనంతరం ఆరోగ్యంపై ప్రజలందరిలో అవగాహన, శ్రద్ధ పెరిగాయి. పండ్లను అధికంగా తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే వేసవిని సాకుగా చూపుతూ డిమాండ్‌కు అనుకూలంగా వ్యాపారులు పండ్ల ధరలు అమాంతం పెంచేస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. జిల్లాలోని జాతీయ రహదారుల వెంట, పట్టణాల్లోని బస్టాండ్ సెంటర్లు, రైల్వే స్టేషన్, వివిధ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని అనేక మంది పండ్ల విక్రయాలు చేస్తున్నారు.

మార్కెట్లో ధరల మంట..

ప్రస్తుతం మార్కెట్లో పరిమాణాన్ని బట్టి డజన్ ఆపిల్ రూ. 300 నుంచి రూ. 350, దానిమ్మ రూ.350 నుంచి రూ. 400, కమల రూ.200, నల్ల ద్రాక్ష కిలో రూ. 120, పుచ్చకాయ కిలో రూ.25, బొప్పాయి కిలో రూ.40, డ్రాగన్ ఫ్రూట్ ఒక్కోటి రూ.100లకు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్లలో పండ్ల వినియోగం అధికమవడంతో..

వాటి ధరలకు రెక్కలు వచ్చినట్లు పండ్ల వ్యాపారాలు చెబుతున్నారు.


ఖర్చులు పెరిగాయి..

పండ్లు కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. వేసవి కావడంతో డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరిగాయి. ఖర్చులు విపరీతంగా పెరగడంతో దానికి అనుగుణంగానే గిట్టుబాటు ధరకు అమ్మకాలు జరుపుతున్నాం.
– శ్రీనివాసరావు, పండ్ల వ్యాపారి, బాపట్ల

వృద్ధురాలి మృతదేహానికి అంతిమ సంస్కారం

తెనాలి: శ్రీ శివలింగేశ్వర స్వామి భక్తబృంద సేవా సమితీ ఆధ్వర్యంలో శనివారం మేడూరి వీరమ్మ(70) అనే వృద్ధురాలి శవానికి అంతిమ సంస్కారాలు చేసింది. నాజరుపేట మేడిశెట్టివారి వీధిలో నివసించే వీరమ్మ భర్త గతంలోనే చనిపోయారు. ఆమె పిల్లలు లేరు. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు మరణించడంతో.. ఆమె సోదరుడి విజ్ఞప్తి మేరకు..సేవా సమితి బుర్రిపాలెంరోడ్డులోని మహా ప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు పూర్తి చేసింది. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, పోతురాజు, సభ్యులు ఉన్నారు. మహాప్రస్థానం కమిటీ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణప్రసాద్ వారిని అభినందించారు.

క్రీడాకారులకు ఆదర్శం సుబ్బారావు



సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శిష్యులు, మిత్రులు

భట్టిప్రోలు: ఎందరో క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన కొసన సుబ్బారావు (ఎన్‌డీఎస్) ఆదర్శప్రాయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్‌డీఎస్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఆయన స్వగృహంలో నిర్వహించారు. శిష్యులు, మిత్రులు, కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. హోదానే పేరుగా మార్చుకున్న సుబ్బారావు చిరస్మరణీయులని తెలిపారు. ఎన్‌డీఎస్‌గా (నేషనల్ డిసిప్లిన్ స్కీమ్) సుపరిచితులైన సుబ్బారావు భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో పని చేసి సాఫ్ట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ తదితర ఆటల్లో విద్యార్థులను తీర్చిదిద్ది జోన్ స్థాయి నుంచి జాతీయ స్థాయికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ, అధ్యక్షుడిగా జాతీయ కబడ్డీ జట్టులో కూడా ఆడి పలువురి మన్ననలను అందుకున్నారన్నారు. సాఫ్ట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో ఆయనకు ప్రావీణ్యం ఉంది. అనేక మంది శిష్యులు ఫిజికల్ డైరెక్టర్లుగా, పీఈటీలుగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన వారు ఉన్నారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కె. సుబ్బారావు, కొసన రమేష్ నాయుడు తదితరులున్నారు.

నేడు సాహిత్యం, సంగీతంపై ప్రత్యేక ప్రసంగం


తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 'సాహిత్యం-సంగీతం' అంశంపై ప్రత్యేక ప్రసంగం ఏర్పాటు చేసినట్టు అధ్యక్ష, కార్యదర్శులు మొవ్వా సత్యనారాయణ, బొమ్మదేవర వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో ప్రముఖ సంగీత విద్వాంసుడు 'కలైమామణి' డాక్టర్ తాడేపల్లి లోకనాథ శర్మ ప్రత్యేక ప్రసంగం చేస్తారని తెలిపారు. సంగీతాభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి పల్లెకోనలో కళా పండుగ

- పరుచూరి రఘుబాబు స్మారక నాటకోత్సవాలకు సర్వం సిద్ధం
- నాలుగు రోజుల పాటు కళాభిమానులకు కనువిందు



పరుచూరి వెంకటేశ్వరరావు



నిర్వహణ లోగో

పల్లెకోన (భట్టిప్రోలు) : మండలంలోని పల్లెకోన గ్రామంలో మూడేళ్ల విరామం అనంతరం పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 31వ డాక్టర్ డి.రామానాయుడు అఖిల భారత ఆహ్వాన నాటక పోటీలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 31వ తేదీ వరకు 4 రోజుల పాటు జరుగనున్నాయి. ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళా సంస్థల నుంచి 6 అత్యుత్తమ సాంఘిక నాటకాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ నాటకాలు ఏ కళా పరిషత్తులోనూ.. ఇంతవరకు ప్రదర్శితం కాలేదని పేర్కొన్నారు. కళలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను చేరవేసే జీవ నదులని పేర్కొన్నారు.

నాటకోత్సవాలకు ఏర్పాట్లు..

స్టేజ్ పనులు, మైక్ సౌండ్ సిస్టమ్, గ్రామంలోనే కాక మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. అతిథులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించామన్నారు. తన కుమారుడు రఘుబాబు స్మారకార్థం 2009 వరకు హైదరాబాద్‌లో జరుగుతూ వచ్చిన నాటకోత్సవాలు 2010 నుంచి పల్లెకోనలో నందమూరి తారక రామారావు ప్రాంగణంలో పరుచూరి రఘుబాబు, టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ కళామండపంలో జరుగుతున్నాయని తెలిపారు. 2019 వరకు నిర్విఘ్నంగా జరగగా ఆ తరువాత కోవిడ్ ప్రభావంతో రెండేళ్ల పాటు బ్రేక్ పడిందన్నారు. 2022లో హైదరాబాద్ రవీంద్రభారతిలో నాటకోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. నాటకోత్సవాలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా నాలుగేళ్ల క్రితం రూ.20 లక్షల వ్యయంతో కళా ప్రాంగణం ఎదుట తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సహకారంతో ఆడిటోరియం ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతి తర్వాత రాష్ట్రంలో భట్టిప్రోలు మండలం పల్లెకోనలో ఆ విధంగా నాటకోత్సవాలు నిర్వహించేందుకు చక్కని వేదికను తీర్చిదిద్దినట్లు వివరించారు.

నేటి కార్యక్రమాల వివరాలు

సాయంత్రం 6 గంటలకు శుభారంభ సభ కార్యక్రమం ప్రారంభమవుతుంది.
– తొలి రోజు సాయంత్రం 6:30 గంటలకు శ్రీ కళా నికేతన్ హైదరాబాద్ వారి ''ఎర్ర కలువ '' నాటకం ప్రదర్శించనున్నారు. రచన భాస్కర్ చంద్ర, దర్శకత్వం డాక్టర్ వెంకట్ గోవాడ.

'ఉపాధి' కూలీలకు 200 రోజులు పని కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు

బాపట్ల అర్బన్: బేతపూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల ప్రదేశానికి శనివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చేరుకుని, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద 200 పని దినాలు కల్పించాలని, తాగు నీరు, మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని వారి దృష్టికి కూలీలు తెచ్చారు. గతంలో మాదిరి వేసవి అలవెన్స్, పలుగు, పారకు డబ్బులు ఇవ్వాలని చెప్పారు. గతేడాది పనిచేసిన డబ్బులు రావాలని, ఎప్పటి కూలి నగదు అప్పుడే జమ అయ్యేలా చూడాలని సంఘ నాయకులకు వివరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కార్మికుల ఐక్య పోరాటంతోనే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోగలమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. ఎనిమిదేళ్ల కాలంలో ఉపాధి హామీ పథకానికి కేటాయిస్తున్న రూ.వేల కోట్ల నిధులు తగ్గించిందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్ల రుణ మాఫీ చేస్తూ.. రైతులు, పేద ప్రజలకు వంద రోజులు కూడా పని దక్కనీయకుండా చేయడం అత్యంత దుర్మార్గమని అభిప్రాయపడ్డారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పడమటి వడగాల్పుల ప్రతాపం



నిర్మానుష్యంగా పిట్టలవానిపాలెం ప్రధాన రహదారి

పిట్టలవానిపాలెం: భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. మండల పరిధిలో రెండు రోజులుగా తీవ్ర ఎండ, పడమటి గాలులు వీస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు హడలిపోతున్నారు. శనివారం మండల పరిధిలో ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఉదయం 9 గంటలకే సూర్య ప్రతాపం ప్రారంభమైంది. మధ్యాహ్నం జనం బయటకు రాకపోవడంతో పిట్టలవానిపాలెం మండల కేంద్రం, రెడ్డిపాలెం, చందోలు సెంటర్లు, రహదారులు నిర్మానుషంగా మారి కర్ఫ్యూను తలపించాయి. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు ప్రజలు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో వాటి గిరాకీ బాగా పెరిగింది. సైజును బట్టి రూ.25 నుంచి రూ.50 వరకు బోండం నీటిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వడగాల్పులు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని చందోలు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లీలా క్రాంత్ కర్మల్ సూచిస్తున్నారు. వడ దెబ్బ తగిలితే.. చల్లని ప్రదేశంలో కూర్చోబెట్టి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని తెలిపారు. ఎండ నుంచి రక్షణ పొందడానికి గొడుగు ఉపయోగించాలని చెప్పారు.

29న 'బాపట్ల' కళాశాల వార్షికోత్సవం

బాపట్ల: బాపట్ల అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు కళాశాల డీన్ డాక్టరు ఎ.మణి శనివారం తెలిపారు. ఈ వేడుకల్లో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టరు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, విశ్వవిద్యాలయం నుంచి బి.జాలాపతిరావు, జి.రామారావు, సాంబశివరావు పాల్గొంటారని తెలిపారు.